విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో ప్రవేశపెట్టిన జగనన్న విద్యాకానుక, ట్యాబ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ, జగనన్న గోరుముద్ద, పర్యవేక్షణ, చైల్డ్ ఇన్ఫోవర్క్ ఏకోపాధ్యాయ పాఠశాలలకు విద్యాబోధన చేయడం, బడిబయట పిల్లలను బడిలో చేర్చడం, మనబడి నాడు-నేడు పనులు చేయించడం వంటి వాటిలో పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయి వరకూ కీలకంగా పనిచేస్తున్నామన్నారు. కావున ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంటిఎస్ అమలు చేయాలని, ప్రతినెలా 1న వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, సిఆర్‌పి వెంకటరాముడు, ఓబులేసు, గోపాల్, ఐఇఆర్‌పిలు, పిటిఐలు పాల్గొన్నారు.

ఓట్ల రాజకీయం..!

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో జిల్లాలో 'ఓట్ల' రాజకీయాలు ఊపందుకున్నాయి. దొంగ ఓటర్లను చేర్చాంటు ప్రతిపక్ష టిడిపి ఆరోపిస్తుండగా, దొంగగా తొలగించేందుకు సిద్ధపడ్డారని అధికార వైసిపి ఆరోపిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఇరు పార్టీలు ఓటర్ల జాబితాపై నిశితంగా దృష్టి సారిస్తున్నాయి. చిన్న తప్పు దొరికినా పట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. వీటి నడుమ ఉద్యోగులు నలుగుతున్నారు. వినకుంటే ఒక సమస్య... వింటే మరో సమస్య అన్న విధంగా మారింది ఉద్యోగుల పరిస్థితి. ఇప్పటికే కొంత మందిపై వేటు పడటంతో మరింత గుబులు రేపుతోంది. ఓటర్ల జాబితాలో అవకతవకల్లో ఇటీవల జిల్లా ముఖ్య అధికారులిద్దరిపై కేంద్ర ఎన్నికల సంఘం కొరాఢా ఝుళిపించింది. అంతకు మునుపు ఇద్దరు బిఎల్‌ఓలపై పడగా, తాజాగా మరో ఇద్దరిపై వేటుపడింది. వరుసగా ఇటువంటి చర్యలుంటుండటంతో ఉద్యోగుల్లో మరింత గుబులు రేకెత్తిస్తోంది.

◆ నలుగుతున్న ఉద్యోగులు
◆ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలంలోని చిలకురికి గ్రామంలో మూడు వేల ఓట్లను నిబంధనలకు విరుద్ధంగా, ఓటర్లు ఉన్నా శాశ్వత వలస వెళ్లారని చూపించి తొలగించారని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా అక్కడికి వచ్చి విచారణ చేపట్టింది. ఈ విచారణలో నిబంధనలు పాటించలేదని తేలడంతో ఇద్దరు బిఎల్‌ఓలతోపాటు, ఎలక్ట్రోరల్, రిటర్నింగ్ అధికారులు ఇద్దరు జిల్లా స్థాయి అధికారులను సస్పెన్షన్ చేశారు. ఇది ఇలాగుంటే అధికార వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కూడా టిడిపి నాయకులకు దొంగ ఓట్లు చేర్చారంటూ ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఇద్దరి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి. ఓట్ల వ్యవహారంపై రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలోనూ టిడిపి వైపు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపిస్తుండగా, వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యారోపణలు చేస్తున్నారు. టిడిపి నాయకులు ఓటర్లకు తెలియకుండానే 15 వేల ఓట్లను ఆన్‌లైన్‌లో తొలగించేందుకు వారంతట వారే దరఖాస్తు చేసుకున్నట్టు చూపించి ప్రయత్నం చేసారని ఆరోపించారు. ఈ నియోజకవర్గంలోనూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఇది ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది.

నలుగుతున్న అధికారులు

రెండు ప్రధాన పార్టీల నాయకులు ఓటర్ల జాబితాను అడ్డుపెట్టుకుని ఆడుతున్న రాజకీయ క్రీడలో ఉద్యోగులు నలిగిపోతున్నారు. అవునంటే ఒకరికి కోపం లేదంటే మరికొరికి కోపం అన్న విధంగా మారింది పరిస్థితి. ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో రూపొందించే క్రమంలో భాగంగా ఎన్నికల సంఘం జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వేను చేపట్టింది. అయితే ఈసర్వే ఆన్‌లైన్‌లో చేసే క్రమంలో యాప్‌లో సాంకేతిక సమస్యలు అధికంగా వచ్చాయి. సర్వర్ సమస్యతో పూర్తి స్థాయి ఆన్‌లైన్ సర్వే జరగలేదు. అతి కష్టం మీద యాభై శాతం వరకు చేయగలిగారు. తక్కినది ఆఫ్‌లైన్‌లో చేసి సరిచేసే చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఇంటింటి సర్వే చేసే క్రమంలోనూ ఉద్యోగులకు తిప్పలు తప్పలేదు. ఎందుకంటే బూత్ లెవల్ అధికారులుగానున్న వారందరూ అధిక శాతం సచివాలయ ఉద్యోగులే ఉన్నారు. వారిలో కొంత వంది సాధారణ విధులూ ఉన్నాయి. ఈక్రమంలో ఇంటింటి సర్వేను పూర్తి స్థాయిలో చేయడంలో ఇబ్బందులు నెలకొన్నాయి. ఆ సమయంలో కొన్ని తప్పిదాలు జరిగే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఈ రకంగానే వజ్రకరూరులో ఇద్దరు బూత్‌లెవల్ అధికారులను జిల్లా కలెక్టరు సస్పెండ్ చేశారు. ఇంటింటి సర్వే చేయలేదు. అయితే సదరు ఉద్యోగులు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్‌గా పనిచేవారు. అతడికి ఇది వరకే తను పనిచేసే చోటే కాకుండా మరో రెండు చోట్ల ఇన్‌ఛార్జి బాధ్యతలూ ఉన్నాయి. ఆ పనే ఎక్కువగానున్న సమయంలో అదనంగా బిఎల్‌ఓ పనిచేయడం ఇబ్బందికరంగా మారింది. సర్వే చేపట్టలేదని చర్యలు తీసుకోవడంతో ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. సొంత పని భారమే ఎక్కువగా ఉండగా అదనంగా ఓటర్ల జాబితా మరింత భారమడంతోనూ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటు పనిభారం, అటు రాజకీయ నేతల ఒత్తిళ్ల నడుమ నలిగిపోతున్నారు.

పారిశుధ్య కార్మికులపై చిన్నచూపు..?

◆ అవార్డు తీసుకునేందుకు అర్హులు కారా..! ◆ కార్పొరేషన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమాజాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచేందుకు పార్శిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి విధులను నిర్వహిస్తుంటారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజల కోసం వారు పనిచేశారు. అనంతపురం ప్రాంతంలో గతేడాది నడిమివంకకు వరదలు రావడంతో అక్కడి పరివాహక ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఈ సమయంలోనూ మేమున్నామంటూ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రజలకు సేవలు అందించారు. ఇంతలా శ్రమిస్తున్న కార్మికులను గుర్తించడంలో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కొనసాగుతోంది. ఇటీవల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ కార్మికులను అవార్డులకు ఎంపిక చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. అవార్డులకు ఎంపిక చేయకుండా ఏదో చేయాలంటే చేయాలన్నట్లు ఓ హాట్‌బాక్స్, శాలువ ఇచ్చి వారిని సంతృప్తి పరిచే ప్రయత్నాన్ని కార్పొరేషన్ అధికారులు చేశారు. దీనిపై కార్మికులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులిచ్చిన వాటిని వారికే 'రిటర్న్‌గిఫ్ట్'గా వెనక్కు ఇచ్చేసి నిరసన తెలిపారు. ప్రజల బాగుకోసం ఇంతలా శ్రమిస్తున్న తమను అవార్డులకు ఎంపిక చేయకుండా అవామానించారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక సేవలో నిమగ్నమయ్యే కార్మికులు అధికారుల దష్టిలో ప్రయోజనకారులు కాదాని ప్రశ్నించారు. గతంలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు కార్మికులను అవార్డులకు ఎంపిక చేసి కలెక్టర్, ఇతర అధికారుల చేతులమీదుగా సత్కరించే వారని, ఇప్పుడు అలా చేయకుండా హాట్‌బాక్సులు ఇచ్చి అవమానించడంపై కార్మికులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యకం చేస్తున్నారు.

కార్మికులను విస్మరించడం తగదు

ప్రజల ఆరోగ్యం, నగర పరిశుభ్రత కోసం మున్సిపల్ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. వారి ఆరోగ్యాలను ఫణంగా పెట్టి గొడ్డు చాకిరీ చేస్తున్నారు. ఇలాంటి వారిని అధికారులు గుర్తించకుండా అవమానించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున అధికారులను సత్కరించి, కార్మికులను విస్మరించడం సరికాదు. గతంలో ఇలాంటి సంస్కృతి లేదు. కరోనా వారియర్స్‌గా విధులు నిర్వహించిన వారే ఇలా నిర్లక్ష్యం చేయడం తగదు. గతేడాది కాలంలో కార్మికులు వివిధ రూపాల్లో ప్రజలకు సేవలు అందించారు. అలాంటి వారిని స్వాతంత్ర్య దినోత్సవం నాడు అవార్డు ఇచ్చి సత్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

నాగభూషణం,
మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

కార్మికులను అవమానించారు..

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను అవార్డులకు ఎంపిక చేయకుండా కార్పొరేషన్ అధికారులు అవమానించారు. ఈ పనులు చేస్తున్నవారంతా దళితులనే కారణంతో వారి పట్ల నిర్లక్ష్యం వ్యవహరించారు. ఇది సరైన పద్ధతి కాదు. జిల్లా ఉన్నతాధికారి చేతులు మీదుగా కాకుండా మున్సిపల్ కార్యాలయంలో నాణ్యతలేని విలువ లేని వస్తువులను కార్మికులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమే అధికారులే సమాధానం చెప్పాలి. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల పట్ల ఇంత చిన్నచూపు తగదు. అధికారులు దీనిపై స్పందించి భవిష్యత్తులో అయినా ఈ తప్పులు జరగకుండా చూడాలి

ఏటీఎం నాగరాజు,
మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు.

సాగునీటి రంగంపై నిర్లక్ష్యం

◆ రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆ హంద్రీనీవా నీటి కోసం సిపిఎం పాదయాత్ర ప్రారంభం

హంద్రీనీవా పరివాహక రైతులు, కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సాగునీటి రంగంపై అడుగడుగునా నిర్లక్ష్యం కొనసాగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. హంద్రీనీవా కాలువ పనులను తక్షణం పూర్తి చేసి, రైతుల పొలాలకు సాగునీటిని అందించాలని కోరుతూ సిపిఎం పాదయాత్ర చేపట్టింది. మూడు రోజుల పాటు జరగనున్న పాదయాత్ర వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్‌హౌస్ వద్ద మంగళవారం ఉదయం ప్రారంభం అయ్యింది. రాగులపాడు హంద్రీనీవా పంప్ హౌస్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర తట్రకల్లు, గంజికుంట, వజ్రకరూరు, కమలపాడు, కమలపాడు తండా మీదుగా మొదటి రోజు కొనసాగింది. పాదయాత్రను రాంభూపాల్ ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ కింద జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని చెప్పారు. పాలకుల నిర్లక్ష్యంతో నీటి సరఫరా జరగలేదన్నారు. ఎన్నికల సమయంలో ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చడంలో అధికార పార్టీ నాయకులు విఫలమయ్యారన్నారు. వైసిపి రైతుసంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పడం కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమైందన్నారు. జిల్లాలో అధికార పార్టీ నాయకులు వారి సొంత ప్రయోజనాలు, స్వార్థ రాజకీయాల చేయడానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. హంద్రీనీవా పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో కళ్లెదుటే కాలువలో నీరు పారుతున్నా అవి రైతుల పొలాలకు చేరని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యంతో హంద్రీనీవా కాలువ కింద సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి డిస్ట్రిబ్యూటరీ పనులను తక్షణమే పూర్తి, సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ మండలాలలోని చెరువులు అన్నింటినీ హంద్రీనీవా నీటితో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల రంగయ్య, రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, గుంతకల్ సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, వజ్రకరూరు మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు నాగరాజు, రంగమ్మ, సుధాకర్, చరణ్ రాజు రైతులు పాల్గొన్నారు.

పారిపోయేందుకు రిమాండ్ ఖైదీ విఫలయత్నం

పట్టుకునే యత్నంలో విరిగిన కానిస్టేబుల్ చేయి - ఖైదీని పట్టుకున్న ప్రజలు

ఖైదీ రామాంజనేయులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని రెడ్డిపల్లి జిల్లాజైలులో రిమాండ్‌లో ఉన్న వ్యక్తి పారిపోయేందుకు విఫలయత్నం చేశాడు. పారిపోతున్న వ్యక్తిని పట్టుకునే క్రమంలో కానిస్టేబుల్ సోమనాథరెడ్డి చేయి విరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం నగరంలోని నవోదయ కాలనీకి చెందిన రామాంజనేయులుపై ఫోక్సో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి జిల్లా సబ్‌జైల్లో రిమాండ్‌లో ఉంటున్నాడు. మంగళవారం అతనికి ప్రొటెన్సి టెస్ట్ చేయించేందుకు అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో మాత్రలు తీసుకునే కేంద్రం వద్ద సెక్యూరిటీగా ఉన్న పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఎఆర్ కానిస్టేబుల్ సోమనాథ్‌రెడ్డి అతన్ని పట్టుకునే ప్రయత్నంలో మెట్ల మీద నుంచి జారి కింద పడ్డాడు. దీంతో అతని చేతికి ఫ్రాక్చర్ అయింది. పారిపోతున్న రామాంజనేయులు ను ఆసుపత్రి వద్ద ఉన్న కొందరు పట్టుకుని ఆసుపత్రిలోని అవుట్ పోస్టులో బంధించారు. అనంతరం జిల్లాజైలుకు తరలించారు. ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ రహిమాన్‌ను వివరణ అడగ్గా ఖైదీని ఓ టెస్టింగ్ కోసం జైలు నుంచి ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ జరిగిన పరిణామం తమ పరిధిలోకి రాదన్నారు. గాయపడ్డ సెక్యూరిటీ కానిస్టేబుల్‌ను చికిత్స కోసం సవేరా ఆసుపత్రికి తరలించారు. పామిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతీని ఎత్తుకెళ్లి అఘాయిత్యం చేసినట్లు రామాంజనేయులుపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అతనికి రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు అతన్ని రిమాండ్ నిమిత్తం జిల్లాజైలుకు తరలించారు. అక్కడ రిమాండ్‌లో ఉండగా ఈ పరిణామం చోటు చేసుకుంది. పారిపోయే ప్రయత్నం చేసిన రామాంజనేయులుపై పామిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

ప్రజాశక్తి-ఉరవకొండ

మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 8న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండలోని ఐసిడిఎస్ కార్యాలయ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పెట్టే భోజనంలో రకరకాలుగా మెనూమార్పులు చేస్తున్నారన్నారు. అయితే మెనూఛార్జీలను మాత్రం పెంచడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూఛార్జీలు పెంచాలని, కార్మికులకు పనికి తగ్గ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. హైస్కూళ్లలో 9, 10 తరగతులకు అదనంగా వర్కర్లను కేటాయించాలన్నారు. వంట చేసే సమయంలో ప్రమాదాలకు గురైన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, నూతన విద్యా విధానం అమలులో స్కూల్స్ మెర్జ్ చేయడంతో అక్కడ ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి కల్పించాలని, వంటకు అవసరమైన వంట పాత్రలు ఇవ్వాలనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమాదేవి, శకుంతల యూనియన్ జిల్లా నాయకులు రామంజినమ్మ, శ్రీదేవి, నాగమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకురాళ్లు

విశ్రాంత సైనికులను సన్మానిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

అగ్రరాజ్యాల సరసన భారత్‌ను నిలపాలి : జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

భారత్‌ను అగ్రరాజ్యాల సరసన నిలిపేందుకు భారతపౌరులు, విద్యార్థులు కృషి చేయాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు అనుబంధ ఓటీపీఆర్ఐలో నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం ఓటీపీఆర్ఇ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం పంచప్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీరులు, వీరవనితలకు వందనం సమర్పించారు. ఉపకులపతి జి.రంగజనార్ధన మాట్లాడుతూ సైనికులు దేశానికి ఎంతో గొప్ప సేవలు అందిస్తున్నారన్నారు. వారిని సన్మానించడం మనకు గొప్ప అవకాశమన్నారు. దేశ ఔనత్యానికి తమ జీవితాలను త్యాగం చేసిన వీరులు, వీరమాతలకు వందనం సమర్పించి, భావి తరాల వారు, వారి త్యాగ నిరతికి అలవరుచుకుని భవిష్యత్‌లో మన దేశాన్ని ఇంకా ప్రగతి పథంలో నిలిపి, అగ్ర రాజ్యాలలో గుర్తింపు పొందడానికి కృషి చేయాలన్నారు. మన దేశ పౌరులందరూ నిజాయితీగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం రిటైర్డ్ సైనికులు ఎస్.వెంకటేష్ జెసిఒ, విశ్రాంత ఆర్మీ ఆఫీసర్ ఎం.ఖాసీంసాహెబ్‌ను సన్మానించారు. రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ మొట్టమొదటగా ప్రతి పౌరుడు దేశ అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. రాబోయే కాలంలో మన దేశాన్ని మరింత అభివృద్ధి చెందేలా దృష్టి సారించాలన్నారు. ఓటీపీఆర్ఐ సంచాలకులు బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తర్వాత కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, పీఆర్ఓ ఎం.రామశేఖరరెడ్డి, అసిస్టెంట్ ప్రభాకర్, ఎంఎస్ఎస్ ఆఫీసర్లు కె.ఇ.శైలజ, మధు, ఓటీపీఆర్ఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'జీడిపల్లి'కి నీరు విడుదల

వైసిపితోనే రాయలసీమకు సాగు, తాగునీరు - మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాయలసీమ ప్రజల సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించిన ఏకైక సిఎం జగన్ అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. వారం రోజుల క్రితం కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి జిల్లాలోని హంద్రీనీవా కాలువకు నీటిని వదిలిన విషయం తెలిసిందే. ఈ నీరు మంగళవారం తెల్లవారుజామున ఉరవకొండ నియోజకవర్గంలోని రాగులపాడు వద్ద 8వ లిఫ్ట్‌కు చేరుకున్నాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, హంద్రీనీవా అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి మూడు మోటార్ల ద్వారా జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర సమర్పించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు దివంగత సిఎం వైఎస్ఆర్ ఇచ్చిన వరం అన్నారు. ఈ కాలువ సామర్థ్యాన్ని ప్రస్తుతం సిఎం జగన్ వెడల్పు చేసి 6 వేల క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చేలా చేశారన్నారు. గాలేరు-నగరి హంద్రీనీవాతో అనుసంధానం చేయడం ద్వారా జిల్లాకు ప్రయోజనాలు చేకూర్చే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఈసారి అతి తక్కువ వర్షపాతం నమోదై రైతులు తీవ్ర ఇబ్బందులు ఉన్న తరుణంలో జిల్లాలోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, హంద్రీనీవా అధికారులు,వైస్సార్‌సీపీ నాయకులు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్విచ్ ఆన్ చేసి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీరు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

నేడు బూదేడులో 'గడపగడపకూ'

గార్లదిన్నె : మండల పరిధిలోని బూదెడు గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రకటన
మహారాజశ్రీ 8వ అడిషనల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టు, విజయవాడ
ఎం.వి.ఓ.పి. నెం. 501/2019

బిట్వీన్:
కొక్కిలిగడ్డ లక్ష్మీదుర్గ మరియు ఇతరులు...పిటీషనర్లు
మరియు
కావలి లక్ష్మన్న మరియు ఇతరులు ... రెస్పాండెంట్లు
అడ్రస్సు :
శీలం వెంకటేశ్వరరెడ్డి (ఆర్-2) తండ్రి : నాగిరెడ్డి, సిబిరోడ్డు, తాడిపర్తి, అనంతపురం.
లారీ రిజిస్ట్రేషన్ నెం. ఏపి02టిబి7209 యొక్క యజమాని

పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, ఈ వార్తాపత్రిక ద్వారా మీకు తెలియజేయమని ది.30-8-2023వ తేదీకి వాయిదావేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, మీ లాయరుగారి ద్వారా గానీ హాజరయి మీ అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనియెడల ఈ పిటీషన్‌ను మీ పరోక్షంగా తీర్మానించబడును.

(బై కోర్టు ఆర్డరు)
వాయిదాతేది: 30-8-2023
సిహెచ్.సుబ్రహ్మణ్యం,
న్యాయవాది, విజయవాడ.
సెల్ : 8099003888

THE COURT OF THE SENIOR CIVIL JUDGE: ADONI.
O.S. NO 306/2015.

Between:
K. Subadramma died by LRS and others. ...Plaintiffs.
Vs
Smt. K. Hanumanthamma and others. ...Defendants.

TO
D-10. M.P. Mallikarjuna S/O. M.P. Veerabhadra Goud C/O. M.P. Mallikarjuna, Ex bank employee, State Bank colony, Mruthi Nagar, Near Seetharam Kalian Mandapam, Ananthapur.
D-11. M.P. Rajasekhar S/O. S/O M.P. Veerabhadra Goud,C/O.M.P.Mallikarjuna, Ex bank employee, State Bank colony, Mruthi Nagar, Near Seetharam Kallan Mandapam, Ananthapur.
D-12. Channa Basamma D/O. M.P. Veerabhadra Goud, Hindu of C/O M.PMallikarjuna, Ex bank employee, State Bank colony, Mruthi Nagar, Near Seetharam Kallan Mandapam, Ananthapur.
D-13. Nagarathnamma D/O. M.P. Veerabhadra Goud, C/O. M.P. Mallikarjuna, Resident Ex bank employee, State Bank colony, Mruthi Nagar, Near Seetharam Kallan Mandapam, Ananthapur.
D-14. Thavudakshamma D/O.M.P.Veerabhadra Goud, C/O. of M.P. Mallikarjuna, ex bank employee, State Bank colony, Mruthi Nagar, Near Seetharam Kalian Mandapam, Ananthapur.

Whereas the above name Plaintiffs filed suit for declaration of right and title and possession of the suit schedule properties. You are hereby directed to appear before this Honorable court on 28-08-2023 at 10.30 AM either in person or your advocate and file objections if any, failing which matter will be decided in your absences and you will be set ex-party.

Shri. **Y.R.MALLIKARJUNA**
Advocate for Plaintiffs.
Adoni

అనంతపురం 4వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
A.S.NO:37/2022
Between:
మంగళ వెంకటలక్ష్మమ్మ మరియు ఇతరులు **...Appellants**
ఎదిరి
మంగళ శివమ్మ మరియు ఇతరులు **...Respondents**
Notice
To
R16: శ్రీమతి డా॥అనితరాజ్, భర్త నాగరాజ్, వైద్యురాలు, డోర్ నెం:3/399 తపోనగరు, అనంతపురం.

పై దావాలో పైన కనబరచిన ప్రతివాది R16 శ్రీమతి డా॥ అనితరాజ్ అనునామె పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ 11/09/2023వ తేది ఉదయం 10:30 గంటలకు హాజరు కావలెను. అట్లు లేని యెడల సదరు 16వ ప్రతివాదిని ఎక్స్‌పార్టి చేసి ఆమె పరోక్షమున పై దావా తీర్మానించెదరనే సంగతి యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
ఎల్.కె.సుధీంద్రనాథ్, ఎమ్.ఎ.నాగేశ్వరి
అప్పిలెంట్స్ పరం వకీలు, అనంతపురం

In the court of the Judge, For Family Cases Cum VII Addl.District Judge : Ananthapuramu
I.A.No:768/2022 in O.S.No:22/2019
Between:
Arabu Nanjundappa **...Petitioner/Plaintiff**
And
Arabu Amarnath and others **...Respondants/Defendants**
Notice to Respondant No:4
R4:Macharla Raju S/o Late C.Lingappa, R/of D.No:12/2/992, Obulamma Nilayam, Sai Nagar, Ananthapuramu.

పై నెంబరు పిటీషన్‌లో 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 30/08/2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
డి.శ్యాంసుందర్, కె.మోహన్ రావ్
అడ్వకేట్స్, అనంతపురం సెల్:9440258700

In the court of the prl. District Judge, Ananthapuramu
E.P.No:52/2007 in M.S.No:185/2001
Between:
M/s.Karnataka State Industrial investment and Development Corporation Ltd., Bangalore. **...plaintiff/D.Hr.**
And
M/s.Vijayanagar Breeding Farms Ltd., Gowda Sandra Village, Kasaba Hobli, Gowribidanur Taluk and Others, **...Respondants/J.Drs.**

వేలం ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై అర్జీదారుడు తన డిక్రీ మొత్తము రాబట్టుకొను నిమిత్తము ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెల్పిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నాడు. వేలంలో పాల్గొన దలచినవారు 08/09/2023వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు
All That Piece And Parcel of Property Bearing Plot Nos, 1 & 2 Formed Out of Sy.No:63 of Government Dry Land Situated Within The Registration District and Sub District of Ananthapuramu and Kakkalapalli Village Lands Measuring Towards East:60 Feet or 18.28 Meters and North:82 Feet or 24.38 Meters Measuring 05.6 Cents and 05.5 Cents, Totally Measuring 11.1 Cents or 0.04 Hectors Together With All The Building and Structures Standing Thereon and To be Constructed/Erected Thereon and Bounded as under:East by:Plot No:3; South by :Plot No:7; West by :20 Feet Road; North by:20 Feet Road.
D.Hr. Value Rs. 35,00,000/-
Amin Value Rs. 50,00,000/-
(By Order of the court)
N.R.K.MOHAN
Advocate for D.Hr., Ananthapuramu

సంగ్రామ సైకిల్‌యాత్రను జయప్రదం చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 23 నుంచి 28వ తేదీ వరకూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న సంగ్రామ సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 23న తాడిపత్రిలో సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభమై గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కనేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు మీదుగా అనంతపురంలో 30వ తేదీ ముగింపు సభ ఉంటుందన్నారు. కాగా బీసీ, ఎస్టీ, ఎస్సీ, వెనుకబడిన విద్యార్థులు చదువుతున్న సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు తిష్టవేశాయని తెలిపారు. తాగడానికి మంచినీరు, నాణ్యమైన భోజనం, మరుగుదొడ్ల సదుపాయం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఐదు నెలల నుంచి సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా కనీసం చదువుకోవడానికి పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేమని విద్యాశాఖ మంత్రి పత్రిక ప్రకటన చేయడం దౌర్భాగ్యంగా ఉందన్నారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పున ప్రారంభించాలన్నారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు అనేక సమస్యలు నడమ విద్యను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ మధ్యకాలంలో విద్యార్థినిలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌ను నివారించి నిర్భయకు చట్టాన్ని అమలు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీకి సొంత భవనం నిర్మించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కావున ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సూర్య ప్రకాష్, వెంకటేష్, శివ, వర్ధన్, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ముగిసిన ఓటరు జాబితా ఇంటింటి సర్వే

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఓటర్ జాబితాపై చేపట్టిన ఇంటింటి సర్వే విజయవంగంగా ముగిసిందని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.రమణా రెడ్డి, కలెక్టరేట్ ల్యాండ్ రీఫార్మ్స్ తహశీల్దార్ సి.విశ్వనాథ్, అనంతపురం తహశీల్దార్ జి.శ్రీధర్ మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఆర్.దివాకర్ రావు తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఓటర్ల నమోదుపై భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 21 నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకూనిర్వహించామన్నారు. సర్వేలో భాగంగా వచ్చిన క్లైయిమ్‌లను వెంటనే ఆన్‌లైన్ చేయడం, డిలిషన్‌పై భారత ఎన్నికల కమిషన్ షాప్ సర్యులర్ జారీ చేసిందన్నారు. 17 ఏళ్లు నిండిన వారందరని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. అక్టోబర్ నెలలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఓటర్ కార్డ్‌లో పేరు కరెక్షన్, మార్పులు ఉంటే ఫాం 8, ద్వారా వెంటనే చేయాలన్నారు. డెత్ కేసులు, వివాహాలు చేసుకున్న ఆడపిల్లలు, పర్మినెంట్ షిఫ్టెడ్, డబుల్స్ ఉన్న వాటిని గుర్తించి ఫారమ్ 7 ద్వారా చేయాలన్నారు. అర్బన్ పరిధిలో ఒకే చోట నుంచి మరొక్క చోటుకు ఇళ్లు మారినట్లు అయితే వారిని గుర్తించి వారు ఎక్కడ నివాసం ఉంటే అక్కడకు ఫారమ్-8 ద్వారా ఓటును బదిలీ చేయాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్‌లో ఉన్నట్లయితే వాటిని షిఫ్టింగ్ ఆఫ్ ఎంట్రీస్ ఫారమ్-8 ద్వారా తెచ్చుకోవాలన్నారు.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలు

ప్రజాశక్తి సిటీ : అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయితీలో దోమల వ్యాప్తి నివారణకు చర్యలు చేపట్టినట్లు సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పంచాయతీలో డ్రైయినేజీలను శుభ్రం చేయించి స్ప్రే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీలో దోమల నివారణకు ఎప్పటికప్పుడు డ్రైయినేజీలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ యం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో పంచాయతీ రాజ్ శాఖ కింద చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, నాడు-నేడు పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం పనులు తదితర అంశాలపై డిఇలు, జెఇలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు, ప్రాధాన్యత భవనాలు, నాడు-నేడు, గడప గడపకూ మన ప్రభుత్వం, ఆయా అభివద్ధి పనులను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా పనుల్లో పురోగతి సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సచివాలయలకు 432 భవనాలు మంజూరు కాగా, 277 భవనాలు పూర్తికాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలకు 361 భవనాలు మంజూరుకాగా, 240 భవనాలు పూర్తి అయినట్లు వివరించారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు 270 భవనాలు మంజూరైతే 132 భవనాల పూర్తయ్యాయన్నారు. మిగిలిన సచివాలయాలు, ఆర్బికేలు, హెల్త్ క్లినిక్‌ల భవనాలు వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రతివారం లక్ష్యం నిర్ధేశించుకుని భవన నిర్మాణాలు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. ఇకపోతే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద 1,220 పనులు మంజూరు కాగా, 1,096 పనులు గ్రౌండ్ అయ్యాయని, వీటిలో 306 పనులు పూర్తికాగా, మరో 500 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జగనన్న కాలనీలకు ఆర్చ్‌ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. ఎంపీ ల్యాండ్స్‌కు సంబంధించి మంజూరైన పనులు గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పని చేయించాలని, కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో చేరుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, సిపిఒ ప్రశాంత్‌కుమార్, పిఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, పిఆర్ ఇఇ శంకరయ్య, డిఇలు, జెఇలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అవాస్తవాలను ప్రచారం చేయడం దుర్మార్గం : పల్లె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కనీసం ఏం జరుగుతుందో తెలుసుకోకుండా ఎన్నికల లబ్ధి కోసం ఎవరిపై పడితే వారి పట్ల తప్పుడు ప్రచారాలు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి, టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ తన భార్య పల్లె ఉమా మృతిచెందిన తర్వాత ఆమె పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుతో మ్యూటేషన్ చేయించుకోవడానికి కదిరి తహశీల్దార్ కార్యాలయం అధికారులను కలిసేందుకు వెళ్లామన్నారు. తహశీల్దార్, డిటి, ఎవరూ లేకపోవడంతో మ్యూటేషన్‌కు దరఖాస్తు చేయాలని సచివాలయ సిబ్బందిని కలిశామన్నారు. వీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పినప్పుడు అందుకు సంబంధించిన చలానా ఫీజులు ఇచ్చానన్నారు. దాన్ని పట్టుకుని ఏవో ఆస్తులు రాసేసుకుంటున్నాడు పల్లె రఘునాథ్‌రెడ్డి అంటూ తప్పు ప్రచారం చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. తన కళాశాలకు సంబంధించిన స్థలం, కావాల్సిన స్థలం పోను మిగతా భూములను విక్రయించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు ఆ భూమిని ఏం చేసుకున్నా తనకు ఏ సంబంధం ఉండదన్నారు. అలాంటిది ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి కనీస జ్ఞానం ఉన్నట్లు లేదన్నారు. తాము కష్టపడి సంపాదించిన ఆస్తిని భద్ర పరుచుకోవడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. తన భార్య పేరుతో ఉన్న ఆస్తిని మ్యూటేషన్ చేసుకోవడం తన హక్కు అన్నారు. లక్షలాది మంది విద్యార్థులను చదువు అందించానని, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించానన్నారు. ఇప్పుడు పల్లె రఘునాథ్‌రెడ్డి వ్యక్తి కాదని.. ఒక వ్యవస్థ అన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. వైసిపి నాయకుల మాదిరిగా భూదందాలు చేసే సంస్కృతి తనది కాదన్నారు. అక్రమ లే అవుట్‌లు వేసి విక్రయిస్తుంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిద్రపోతున్నారా.. అంటూ ప్రశ్నించారు. రేపటి నుంచి అక్రమ లే అవుట్ భూదందాలను బయటపెడతామని, దమ్ముంటే వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు పరువు నష్టం దావా వేస్తామని, కోర్టుకు ఈడ్చుతానని హెచ్చరించారు.

క్రీడల అభివృద్ధికి నిధులు విడుదల : జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు విద్యార్థులు ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు నిధులు విడుదల చేసినట్లు జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియులోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో 14వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2023-24 సంవత్సరానికి సంబంధించిన వివిధ క్రీడలను నిర్వహించాల్సిన కళాశాలలు, క్రీడల అభివృద్ధికి సంబంధించిన విషయాలను స్పోర్ట్స్ కౌన్సిల్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక బడ్జెట్‌ను స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, యూనివర్సిటీ రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు ఇ.కేశవరెడ్డి, ఓటీపీఆర్ ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విశాలి, పద్మావతి, మహిళా విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ సెక్రటరీ జి.సారా సరోజిని, అదిశంకర కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు విద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ జి.రవిచంద్ర, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు, రాజం పేట కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.నాగముని, ఆర్‌జెయు కెటి స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎస్‌కె.శంషాద్‌బేగం, పీఆర్ఓ.రామశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గురించి మాట్లాడే అర్హత సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్‌కు లేదని వైసిపి నేతలు అన్నారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్వార్ధ రాజకీయాలు చేయడం విశ్వేశ్వర్‌రెడ్డి చరిత్రలో లేదన్నారు. ప్రజా సమస్యల కోసం నిత్యం పోరాడే పార్టీలో ఉండి బూర్జువా పార్టీల నాయకులకు వత్తాసు పలికే విధంగా జగదీష్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జగదీష్ మాట్లాడిన విధానాలు చూస్తుంటే సిపిఐ ఆదేశాల ప్రకారం మాట్లాడారా.. పయ్యావుల కేశవ్ ఇచ్చిన ప్యాకేజీ కోసమా.. లేకపోతే రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు కోసమా.. అనే అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా జగదీష్ వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, జెసిఎస్ మండల కన్వీనర్ ఆసీఫ్, మండల కో ఆప్షన్ సభ్యులు సలీం, ఉప సర్పంచి వన్నప్ప, ఎంపిటిసి వన్నూరుసాహెబ్, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషాశ్రీచరణ్

పేదల పక్షపాతి సిఎం జగన్

మంత్రి ఉషాశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సిఎం జగన్ పేదల పక్షపాతిగా నిలిచారని మంత్రి ఉషాశ్రీచరణ్ అన్నారు. మంగళవారం కంబదూరు మండల పరిధిలోని జల్లిపల్లి గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చాక వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసి పేదల కలను సాకారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దొంగఓట్లపై టిడిపి తప్పుడు ఆరోపణలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దొంగ ఓట్ల తొలగింపుపై టిడిపి నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగఓట్లు తొలగించాలనే డిమాండ్‌తో పరిటాల సునీత, తమ పార్టీ సానుభూతి ఓట్లు తొలిగించారంటూ పయ్యావుల కేశవ్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పరిటాల సునీత ఆధ్వర్యంలో అనంతపురంలోని తన ఇంట్లో 20 కంప్యూటర్లు పెట్టుకుని ఆపరేటర్లను ఏర్పాటు చేసుకుని ఓట్లు తొలిగించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. తమ ఓటును తామే తొలగించుకుంటామంటూ సునీత ఇంటికి గోడోమంటూ వెళ్లి చేసిన దరఖాస్తులపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాప్తాడు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు హరి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

దొంగఓట్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

మాజీమంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం

దొంగఓట్ల విషయంలో ఆధారాలతో సహ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, చర్యలు తీసుకోకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీమంత్రి పరిటాల సునీత తెలిపారు. మంగళవారం అనంతపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తుంటే అసలు ఆయన చదువుకున్నారో లేదో అనే అనుమానం కలుగుతోందన్నారు. తాము 12వేలకు పైగా దొంగఓట్లు ఉన్నాయని ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మీ స్వగ్రామం తోపుదుర్తిలోనే 480 ఓట్లు నకిలీవిగా తేలాయన్నారు. ఎక్కడో ప్రొద్దుటూరులో ఉన్నవారి ఓట్లు తోపుదుర్తిలోకి ఎలా వచ్చాయో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా బిఎల్ఓలు ఇంటింటా సర్వే చేస్తే మీ సోదరుడు రాజశేఖర్‌రెడ్డి వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో దొంగఓట్లు ఉన్నాయని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలని నిలదీశారు. దొంగ ఓట్లపై త్వరలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

మాట్లాడుతున్న మాజీమంత్రి పరిటాల సునీత

రూ.2 కోట్ల నగదు దోపిడీ

గార్లదిన్నె : మండల పరిధిలోని రాందాస్ పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై బెంగళూరు నుంచి హైదరాబాదుకు ఇన్నోవా వాహనంలో తీసుకెళ్తున్న రూ.2కోట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... ఓ కన్స్ట్రక్షన్ కంపెనీకి చెందిన సిబ్బంది హైదరాబాదులో లేబర్ పేమెంట్ చేసేందుకు రూ.కోట్ల నగదు తీసుకెళ్తుండగా కణంపల్లి క్రాస్ వద్ద ఇన్నోవా వాహనాన్ని అడ్డగించిన గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలోని వారిని కిందకు దింపి డ్రైవర్‌ని భయపెట్టి డబ్బులతో ఉడాయించినట్లు తెలిపారు. దీంతో బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

రహదారి పనులు ఆపాలని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీ ఇండేన్ గ్యాస్ గోదాం సమీపంలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జాతీయ రహదారి సమీపంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు పనులు చేపట్టగా చేయరాదంటూ స్థానికులు అడ్డుకున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీ నుంచి బైపాస్ రోడ్డుకు రస్తా లేకపోవడంతో రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ మారుతి, స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్న రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. ఇదివరకూ గ్యాస్ గోదాము ముందు భాగాన ఉన్న కచ్చా రోడ్డుపైనే సిమెంట్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలోనే వన్నూరుస్వామి అనే వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కమిషనర్ దివాకర్ రెడ్డిని వివరణ కోరగా గ్యాస్ గోదాము ప్రాంతంలో సిమెంట్ రోడ్డు లేకపోవడంతో వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గతంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయగా రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేశారన్నారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్కడ రహదారి ఉండటంతో నిర్మాణం పనులు చేపట్టామన్నారు. తహశీల్దార్ మారుతి స్పందిస్తూ ప్రజల సమక్షంలోనే సర్వే చేపట్టామన్నారు. రాయదుర్గం నుంచి ఆయుతపల్లి గ్రామానికి వెళ్లే కచ్చా రహదారి రెవెన్యూ రికార్డుల్లో ఉండటంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చని మున్సిపల్ అధికారులకు సూచించామన్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని నివారిస్తున్న పోలీసులు, స్థానికులు

అనారోగ్యంతో మాజీ సర్పంచి మృతి

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కెపి.దొడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి నాగప్ప (55) అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన టిడిపి మద్దతుదారుడుగా సర్పంచుగా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పార్టీలకతీతంగా సేవ చేశారు. అలాంటి ఆయన మృతి తీరనిలోటు అని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు నివాళులర్పించారు.

భూఆధార్ లింక్ చేయించుకోవాలి

గుంతకల్లు రూరల్ : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి వర్తించేందుకు ప్రతి రైతూ తప్పనిసరిగా భూఆధార్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కె.స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు మండల పరిధిలో 218 మంది రైతులు తమ భూమి వివరాలకు ఆధార్ లింక్ చేయించుకోలేదన్నారు. భూఆధార్ చేయించుకోకపోతే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం వర్తించదన్నారు. అదేవిధంగా రైతుల బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు చేయించుకోకపోయినా ఖాతాలో నగదు జమ కాదన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాళ్ : శ్రావణమాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేదమంత్రాలతో రాగి కవచం, సువర్ణ కిరీటం అలంకరించి తమలపాకుల పూజ, కుంకుమార్చన, అభిషేకాలు చేసినట్లు ఆలయ అర్చకులు అనిల్‌స్వామి తెలిపారు. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని ఎనిమిది కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22, 23, 24వతేదీల్లో ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి అవసరమైన పత్రాలను సమర్పిస్తే ఆయా కేంద్రాల్లో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి 'ఉపాధి' పనుల తనిఖీ

బుక్కరాయసముద్రం : నేటి నుంచి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించనున్నట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి సిబ్బందితోపాటు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం గ్రామాలకు వచ్చినప్పుడు ఉపాధి సిబ్బంది సక్రమంగా పనులను చూపించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి పి.రమణారెడ్డి, ఎస్ఆర్పీ వెంకటేష్‌నాయక్, ఎపిఒలు శ్రీదేవి, ఎం.పోలేరయ్య, జెఇ ఓంప్రసాద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల నిరసన

గుత్తి : దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే లోకో డీజిల్ షెడ్‌లో టీ విరామ సమయంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే షెడ్యూల్‌లో ఇంజిన్ వద్ద పనిచేస్తూ శాంతారామ్ అనే కార్మికుడు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్మికులు రైల్వే ఇంజిన్ వద్ద పనిచేస్తున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాప్ కో టెక్ ఇంజిన్లు, పి ఫోర్ ఇంజన్లకు తగినంత మంది కార్మికులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎస్ నారాయణ, బ్రాంచి కార్యదర్శి రామాంజనేయులురెడ్డి, త్యాగరాజు, కృష్ణానాయక్, జాన్సన్‌బాబు, రంగనాయకులు, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు

గుత్తి : మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, ఐటీ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో త్వరలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు అవుతుందన్నారు. రెవెన్యూ అధికారులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్నారని చెప్పారు. గుత్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు, గురుప్రసాద్ యాదవ్, సచివాలయాల కన్వీనర్ రంగస్వామి, నాయకులు మల్లికార్జున, గోపాల్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం : నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన జిలాన్‌బాషా తనయుడు దాదాపీర్ కుటుంబానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. దాదాపీర్ ఉద్యోగ నిమిత్తం సౌదీ వెళ్లాడు. ఉద్యోగం, ఇతరాత్ర కారణాల కారణంగా ఒత్తిడికి గురై కొన్ని రోజుల క్రితం అక్కడే ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సౌదీలోని తనకున్న పరిచయస్తులతో దాదాపీర్ అంత్యక్రియలకు ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా నగరంలోని ఆజాద్‌నగర్‌లోని దాదాపీర్ నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా రూ.3 లక్షలు మంజూరు చేయించారు.